

బెల్లంపల్లి : దుర్గం చిన్నయ్యను కలిసిన తాండూర్ మండల ఉపసర్పంచ్‌ల సంఘం సభ్యులు

# చిన్నయ్యను గెలిపించుకుంటాం

- తాండూర్ మండల ఉప సర్పంచ్‌ల సంఘం..
- బీఆర్ఎస్‌లో చేరిన నీల్వాయి గ్రామ నాయకులు

ల్లంపల్లి, అక్టోబర్ 30 : బెల్లంపల్లి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తాండూర్ మండల ఉప సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రౌతు వెంకటేశం స్పష్టం చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే నివాసంలో దుర్గం చిన్నయ్యను కలిశారు. తమ సంఘం పూర్తి మద్దతు చిన్నయ్యకు ఉంటుందని వెల్లడించారు. గత తొమ్మిదేళ్లుగా నిత్యం ప్రజల్లో ఉన్న చిన్నయ్యకు ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలాల్లో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని గుర్తు చేశారు. హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్‌ల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరికలు..

వేమనపల్లి, అక్టోబర్ 30 : నీల్వాయి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు చల్లా రోషిరెడ్డి, జోడు బుచ్చయ్య సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి, ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. ఈ



కన్నెపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ సత్యనారాయణ

కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోలి వేణుమాధవ్‌రావు, సింగిల్ విండో చైర్మన్ కుబిడె వెంకటేశం, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకుడు పురాణం లక్ష్మీకాంత్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు హమీద్‌ఖాన్, నాయకులు చిన్నన్న పాల్గొన్నారు.

### కన్నెపల్లిలో సమావేశం..

కన్నెపల్లి, అక్టోబర్ 30 : ముచ్చటగా మూడోసారి బెల్లంపల్లి ఎమ్మెల్యేగా దుర్గం చిన్నయ్యను గెలిపించుకోవాలని కన్నెపల్లి జడ్పీటీసీ సత్యనారాయణ అన్నారు. కన్నెపల్లి మండల కేంద్రంలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలు అందరు బీఆర్ఎస్ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికీ వెళ్లి బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు ఓట్లు వేయాలని అభ్యర్థించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వేమనపల్లి : పార్టీలో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే చిన్నయ్య

# బీమాతో ధీమా..

- పంచాయతీ కార్మికులకు రూ.5 లక్షల బీమా సౌకర్యం
- అంత్యక్రియలకు రూ.10 వేల సాయం
- తాండూర్ మండలంలో 70 మందికి ప్రయోజనం
- సర్వత్రా హర్షం..

తాండూర్, ఆగస్టు 30 : గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. రైతు బీమా తరహాలోనే కార్మికులు ఏ కారణం చేత మృతిచెందినా నామినీకి రూ.5 లక్షల బీమా సాయం అందించేలా చర్యలు చేపట్టింది. అలాగే అంత్యక్రియల ఖర్చులకు గతంలో చెల్లించే రూ.5 వేల సాయాన్ని రూ.10 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. బీమా ప్రీమియం అంత్యక్రియల ఖర్చులను గ్రామపంచాయతీ నిధుల నుంచే చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో మండలంలోని పారిశుధ్య కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### 70 మందికి ప్రయోజనం...

బీమా సౌకర్య కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయంతో తాండూర్ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న 70 మంది కార్మికులకు ప్రయోజనం కలుగనున్నది. కార్మికులు, ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం.. దేశంలో ఎక్కడా లేని విధంగా వేతనాలు అందజేస్తూ సమాజంలో తలెత్తుకొని జీవించేలా చర్యలు తీసుకుంటున్నది.



పారిశుధ్య పనులు చేస్తున్న జీపీ కార్మికులు

### సర్కార్‌కు రుణపడి ఉంటాం..



*ప్రభుత్వం మా కార్మికుల కష్టాలను గుర్తించి రూ.8,500 నుంచి రూ.9,500 వరకు వేతనం పెంచింది. సీఎం కేసీఆర్ రైతు బీమా తరహాలోనే మాకు బీమా కల్పించడం చాలా సంతోషంగా ఉంది. మా కష్టాలను గుర్తించిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం. ప్రజల మేలు కోసం పని చేసే ప్రభుత్వానికి అండగా ఉంటాం.*

**- అమ్జద్ హుస్సేన్, పారిశుధ్య కార్మికుల సంఘం అధ్యక్షుడు, తాండూర్**

### ప్రభుత్వానికి కృతజ్ఞతలు..



*పారిశుధ్య పనులు చేస్తున్న వారికి ముఖ్యమంత్రి కేసీఆర్ మే నెలలో జీతాలు పెంచారు. ఇప్పుడు బీమా సౌకర్యంతో పాటు అంత్యక్రియల ఖర్చులను రూ.10 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అందుకు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు. సీఎం కేసీఆర్ సార్ ప్రజలందరికీ మంచి పనులు చేస్తున్నడు. ఆయనకు రుణపడి ఉంటం.*

**- గొర్ల బాలకిషన్, పారిశుధ్య కార్మికుడు, కిష్టంపేట**

### ఆనందంగా ఉంది..



*బీమా సదుపాయం కల్పించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ సార్‌కు కృతజ్ఞతలు. మా కష్టాన్ని ప్రభుత్వం గుర్తించినందుకు సంతోషపడుతున్నాం. కార్మికులు చనిపోతే కుటుంబాలు రోడ్డున పడకుండా వారికి సర్కారు అండగా నిలుస్తున్నది. బీమా సదుపాయం కార్మికుల కుటుంబాలకు ధీమా ఇస్తుంది. ప్రభుత్వ నిర్ణయంతో మాకు మేలు జరుగుతది.*

**- ఏములకుర్తి భరత్, పారిశుధ్య కార్మికుడు, మాదారం, తాండూర్**

### వివరాలు సేకరించాం..



*గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా బీమా సౌకర్యం కల్పించేందుకు నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే అన్ని గ్రామాల్లో కార్మికుల వివరాలు సేకరించాం. ఆదేశాలు రాగానే జీపీ నిధుల నుంచి ప్రీమియం చెల్లించి, బీమా సౌకర్యం కల్పిస్తాం. త్వరలోనే బీమా సౌకర్యం అమలయ్యేలా చూస్తాం.*

**- సత్యనారాయణ, ఎంపీవో, తాండూర్**

# మానవ హక్కుల దినోత్సవం

భీమిని, అక్టోబర్ 30 : భీమినిలోని ఎస్సీ కాలనీలో సోమవారం మానవ హక్కుల దినోత్సవాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు మానవ హక్కులపై అవగాహన కల్పించారు. పౌరులకు కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని, గ్రామాల్లో అందరు కలిసి మెలిసి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశం, ఏఎస్ఐ రాజయ్య, పంచాయతీ కార్యదర్శి రాజు, ప్రజలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

# పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలి

తాండూర్, అక్టోబర్ 30 : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని ఎంపీవో సత్యనారాయణ కార్యదర్శులను ఆదేశించారు. మొబైల్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా మండలంలోని బోయపల్లి పంచాయతీని సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. గ్రామపంచాయతీలో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేసి, ట్రెజరీలో జమచేయాలని, రసీదులను ఈ-పంచాయత్ పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. వారం రోజుల్లో ఎక్కడా ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. పంచాయతీలో సేకరించిన పొడిచెత్తను సెగ్రిగేట్ చేయాలని, వేరు చేసిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను విక్రయించి పంచాయతీకి ఆదాయం సమకూర్చుకోవాలని తెలిపారు. నాలాల్లో పూడిక పూర్తిగా తీసి, నీరు నిల్వ ఉండకుండా చూడాలని, సీసీ చార్జెస్ ప్రతినెలా క్రమం తప్పకుండా చెల్లించి బకాయిలు లేకుండా చూడాలన్నారు. శ్మశాన వాటిక, సెగ్రిగేషన్ షెడ్డు, తెలంగాణ క్రీడా ప్రాంగణం, పల్లె ప్రకృతి వనాలకు బయోఫెన్సింగ్ తప్పకుండా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట కార్యదర్శి రమేశ్, సిబ్బంది ఉన్నారు.



సెగ్రిగేషన్ షెడ్డు పరిశీలిస్తున్న ఎంపీవో

# పోలింగ్ కేంద్రం పరిశీలన

వేమనపల్లి, అక్టోబర్ 30 : వేమనపల్లి మండలంలోని గొర్లపల్లి పంచాయతీ పరిధి కాటేపల్లి గ్రామంలో గల పోలింగ్ కేంద్రాన్ని సోమవారం ఎంపీడీవో లక్ష్మయ్య పరిశీలించారు. కేంద్రంలోని సౌకర్యాల గురించి ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి, ఓటర్లకు తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆయన వెంట ఏఈ పీఆర్ శ్రీధర్, ఆర్ఐ లక్ష్మణ్, బీఎల్‌వోలు తదితరులు ఉన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మయ్య